క్లుప్తంగా

దేవాంగ వివాహ పరిచయ వేదిక రేపు

నెల్లూరు(వేదాయపాళెం): దేవాంగ వధూవరుల వివాహ పరిచయ వేదికను రామ్మూర్తినగర్‌లో ఆదివారం ఉదయం నిర్వహించనున్నామని దేవాంగ సంక్షేమ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బయోడేటా, ఫొటోలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 95533 93566 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన



నెల్లూరు రూరల్: పెనుబర్తిలో నిర్వహిస్తున్న జాతీయ ఉపాధి హామీ పనులను రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ శుక్రవారం పరిశీలించారు. కూలీలకు పలు సూచనలు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కూలీలకు నిర్దేశిత పని దినాలను కల్పిస్తామని వివరించారు. పంచాయతీ కార్యదర్శి ఫిరోజ్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

ఇందుకూరుపేట(విడవలూరు): మద్యం బాటిళ్ల అక్రమ రవాణా కేసులో నిందితుడిగా ఉన్న కొమరి బాబును శుక్రవారం కోవూరు ఎస్‌ఈబీ అధికారులు తహసీల్దార్ చంద్రశేఖర్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈబీ ఎస్సై నరహరి మాట్లాడుతూ మండలంలోని పొన్నపూడి గ్రామానికి చెందిన పొన్నపూడి బాబు 2021 సెప్టెంబర్‌లో 96 కర్ణాటక మద్యం బాటిళ్లను తరలిస్తూ పట్టుబడ్డాడని తెలిపారు. ఈ మేరకు ఏడాదిపాటు రూ.2 లక్షల పూచీకత్తుపై బైండోవర్ చేశామన్నారు. మండలంలో ఎక్కడైనా నాటుసారా తయారు చేస్తున్నా, గంజాయి విక్రయిస్తున్నా 14500 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట ఎస్‌ఈబీ సిబ్బంది ఉన్నారు.

షుగర్ ఫ్యాక్టరీలో సినిమా షూటింగ్

కోవూరు: స్థానిక షుగర్ ఫ్యాక్టరీలో శుక్రవారం 'దొంగ దొంగలు' అనే సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ షూటింగ్ నాలుగు రోజులపాటు జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ పాపిశెట్టి చిరంజీవి, రాజనాల శివసందీప్ తెలిపారు. ఈ సినిమాలో కేరాఫ్ కంచరపాళెం ఫేమ్ కేశవ, పుష్ప–2లో విలన్ పాత్ర పోషించిన రాజరాయులు, విశ్వనాథ్ నటిస్తున్నారని తెలిపారు. ఈ సినిమాను నెల్లూరు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించనున్నట్లు తెలిపారు.

తెగుళ్ల నివారణపై రైతులకు శిక్షణ

కొడవలూరు(విడవలూరు): వరి పంటను ఆశించే తెగుళ్ల నివారణపై విడవలూరులోని రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు శిక్షణా కేంద్రం డీడీఏ జి.శివనారాయణ, నెల్లూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సురేఖాదేవి, రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ వీవీ శిరీష హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పంటను ఆశించే పురుగులు, తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై రైతులకు వివరించారు.

భూ వివాదాలకు రీ సర్వేతో పరిష్కారం

ఇందుకూరుపేట(విడవలూరు): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకం ద్వారా చేపట్టే భూముల రీ సర్వేతో భూవివాదాలకు పరిష్కారం లభిస్తోందని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. విడవలూరులో శుక్రవారం డ్రోన్ సహాయంతో రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి రాష్ట్రం ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, తద్వారా అసలైన భూ హక్కుదారులను గుర్తించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్, నాయకులు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు దేశ ఆర్థిక వ్యవస్థ మంచి వేదిక

వెంకటాచలం: ప్రపంచ దేశాల్లో భారతదేశ ఆర్థిక వ్యవస్థ పెట్టుబడులకు మంచి వేదిక అని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి అన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో శుక్రవారం 'ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఆన్ ఇండియన్ సెక్యూరిటీ మార్కెట్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వైస్ చాన్సలర్ మాట్లాడుతూ వివిధ అంశాలపై నిర్వహించే సదస్సుల్లో విద్యార్థినీ, విద్యార్థులు తప్పనిసరిగా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీఎస్‌యూ ప్లేస్‌మెంట్ కెరీర్ కౌన్సిల్ విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించడం విద్యార్థులకు చక్కని అవకాశమన్నారు. సదస్సులో పలువురు ప్రముఖులు స్టాక్ మార్కెట్‌లో ఏ విధంగా పెట్టుబడులు పెట్టాలో వివరించారు.

ప్రజలకు అవసరమైనవి చేయాల్సిన బాధ్యత ఉంది

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజలకు అవసరమైనవి చేయాల్సిన బాధ్యత తనపై ఉందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని 16వ డివిజన్లో గల జగదీష్‌నగర్‌లో ఒకటో వీధి నుంచి ఏడో వీధి వరకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించిన అనంతరం ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు నగర నియోజకవర్గంలో తనపై పోటీ చేస్తానని అప్పుడప్పుడూ చుట్టపుచూపుగా వచ్చే జనసేన నేత మనుక్రాంత్‌రెడ్డి చెప్తున్నారన్నారు. నగరంలోని డివిజన్లలో ఏయే ప్రాంతాలున్నాయి.. ఏయే వీధులున్నాయో ముందు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. పొత్తుతో వస్తారో.. లేక విడిగా పోటీ చేస్తారో వారి ఇష్టమని.. తనపై ఎవరు పోటీకి వచ్చినా స్వాగతిస్తానని తెలిపారు. జనసేన నుంచి మరో వ్యక్తి ఏడాదిగా తిరుగుతున్నారని.. ఎవరు పోటీ చేస్తారో ముందు తేల్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీకాంత్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



పథకాల అమలు తీరును ఆరాతీస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

• ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 28వ డివిజన్లో గల హౌసింగ్ బోర్డు కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిపై స్థానికులకు కరపత్రాలను అందజేశారు. సమస్యలతో పాటు పథకాల అమలు తీరును ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. దేశానికే ఆదర్శవంతంగా సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల వారికి పథకాలను అందించే విషయంలో తాను అంకితభావంతో పనిచేస్తున్నానని చెప్పారు. అర్హులై పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్పొరేటర్ అహల్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సాయిసునీల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఆర్టీసీ నెల్లూరు ఒకటో డిపో గ్యారేజీలో రోడ్డు భద్రత వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. అధిక శాతం ప్రమాదాలు మానవ తప్పిదాలతోనే జరుగుతున్నాయని చెప్పారు. వాహనాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా డ్రైవర్లు శిక్షణ పొందాలని కోరారు. డిపో మేనేజర్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

• రీజియన్లోని ఏడు డిపోల్లో రోడ్డు భద్రత వారోత్సవాలను ఫిబ్రవరి రెండు వరకు నిర్వహించనున్నామని జిల్లా ప్రజారవాణాధికారి శేషయ్య పేర్కొన్నారు. ప్రమాద రహిత డ్రైవర్లను గుర్తించి సురక్షితమైన డ్రైవింగ్ మెళకువలను నేర్పించడంతో పాటు ఇతర అంశాలపై కౌన్సెలింగ్‌ను ఇవ్వనున్నామని చెప్పారు. ప్రమాద రహిత సర్వీస్ డ్రైవర్లను గుర్తించి వారికి ప్రశంసపత్రాలు, నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నామని వెల్లడించారు.

అక్రిడిటేషన్ సాధించడంలో భాగస్వాములు కావాలి

నెల్లూరు (టౌన్): అంబేడ్కర్ విశ్వవిద్యాలయం న్యాక్ అక్రిడిటేషన్‌ను సాధించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని రీజినల్ కో ఆర్డినేటర్ పిచ్చయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. న్యాక్ నుంచి వచ్చే మెయిల్‌ను విద్యార్థులు రెండు రోజులకోసారి పరిశీలించాల్సి ఉంటుందని చెప్పారు. సులువైన ప్రశ్నావళి ఉంటుందని, వీటి సమాధానాలపై క్లిక్ చేసి సబ్మిట్ చేయాలని కోరారు. అభ్యాసకుల సేవా కేంద్రానికి ఆదివారం హాజరుకావాలని సూచించారు.

సిబ్బందికి ఎస్పీ అభినందన

నెల్లూరు(క్రైమ్): హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు, జరిమానా పడేలా చేసిన కృష్ణపట్నం పోర్టు సీఐ వేమారెడ్డి, తోటపల్లిగూడూరు సిబ్బందిని ఎస్పీ విజయారావు శుక్రవారం ఒక ప్రకటనలో అభినందించారు. తోటపల్లిగూడూరుకు చెందిన శివకృష్ణపై అదే ప్రాంతానికి చెందిన వెంకటరమణ 2018లో కత్తితో దాడి చేశారు. ఘటనపై హత్యాయత్నం కేసును నమోదు చేసిన తోటపల్లిగూడూరు పోలీసులు నిందితుడ్ని అరెస్ట్ చేశారు. నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ.ఐదు వేల వేల జరిమానాను ఫస్ట్ ఏడీజే కోర్టు జడ్జి విధించారు. ఈ క్రమంలో ఏపీపీ నీరజ, కృష్ణపట్నం పోర్టు సీఐ, తోటపల్లిగూడూరు ఎస్సై ఇంద్రసేనారెడ్డి, అప్పటి ఎస్సై శివకృష్ణారెడ్డి, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాసరావును ఎస్పీ అభినందించారు.

ఏఐసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా సురేంద్రబాబు



నెల్లూరు(బారకాసు): ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా సురేంద్రబాబును నియమించారు. నగరంలోని ఇన్‌ఫెంట్ జీసస్ సెంటర్‌లో ఏఐసీఎఫ్ రాష్ట్ర సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షుడు విజయరాజు హాజరయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హిందుపురానికి చెందిన నాగేంద్రకుమార్, కోశాధికారిగా రాజమహేంద్రవరానికి చెందిన మార్టిన్, కమిటీ సభ్యులను నియమించారు. అడ్‌హాక్ కమిటీ సభ్యులు నాగేంద్రకుమార్, వెంకటనాథ్, రెవరెండ్ రాజశేఖర్, నేతలు డేవిడ్ దయాసాగర్, రాజశేఖర్ దాసరి, ఎలీషాకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరు రూరల్: పడారుపల్లిలోని గంగమ్మ ఆలయంలో కల్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపనను వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మేయర్ స్రవంతి శుక్రవారం చేపట్టారు. కార్పొరేటర్లు శ్రీనివాసులురెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 23, 24వ డివిజన్ల అధ్యక్షులు పుల్లారెడ్డి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



నెల్లూరు(బారకాసు): బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లను పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ సభ్యురాలు భారతి, శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీరామరాజు, పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, ఆశ్రమ నిర్వాహకుడు పాండు, సుదర్శనరావు, నందకృష్ణాచారి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బారకాసు): అమీర్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి బాలల చిత్రకళా పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని టౌన్‌హాల్లో ఆదివారం నిర్వహించనున్నామని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నగరంలోని కళాసంఘాల కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పలువురికి ఆత్మీయ పురస్కారాలను అందజేయనున్నామని వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారని తెలిపారు. కళాసంఘాల కన్వీనర్ హరిబాబు, హరనాథ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సింహపురి మూవీ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సయ్య, అమీర్‌జాన్, ఖాదర్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

క్షయ నియంత్రణకు కృషి చేయాలి



పౌష్టికాహారాన్ని అందజేస్తున్న వెంకటప్రసాద్

నెల్లూరు(అర్బన్): జిల్లాలో క్షయ వ్యాధిని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏడీఎంహెచ్ఓ, జిల్లా టీబీ, కుష్ఠు నియంత్రణాధికారి వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కొండాయపాళెంలోని అబైడింగ్ హోప్ చర్చి వద్ద 25 మంది టీబీ రోగులు ఒక్కొక్కరికీ రూ.1500 విలువైన నిత్యావసరాలు, పౌష్టికాహార కిట్లను శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అజాగ్రత్త వహిస్తే కుటుంబసభ్యులకు సైతం సోకే ప్రమాదం ఉందని చెప్పారు. అనంతరం అన్నదానం చేశారు. అబైడింగ్ హోప్ ట్రస్ట్ ఫౌండర్ నిర్మల్‌కుమార్, విశ్రాంత ఎస్సై ధర్మారావు, జిల్లా వైద్యశాఖ సిబ్బంది క్రాంతికుమార్, శివకుమార్, విజయ్, అష్రఫ్, తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమికి కళాత్మక శుభాకాంక్షలు

రథసప్తమిని పురస్కరించుకొని నగరానికి చెందిన పలువురు కళాకారులు వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపారు. – నెల్లూరు(బారకాసు)



బీవీనగర్‌కు చెందిన ఏడో తరగతి విద్యార్థిని పూజిత రంగు పెన్సిళ్లతో రథసప్తమి అనే పదాలతో చిత్రపటాన్ని రూపొందించారు.



బీవీనగర్‌కు చెందిన కార్పెంటర్ శ్రీనివాసులు తన వృత్తి నైపుణ్యంతో రంగు రంగుల చొక్కా గుండీలతో రథం, ఉదయిస్తున్న సూర్యుడ్ని తీర్చిదిద్దారు.

విద్యార్థికి అభినందన



నెల్లూరు రూరల్: తిరుపతిలో శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ – 19 ఫుట్‌బాల్ పోటీలకు సౌత్‌మోపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి శ్రీనివాసులు ఎంపికయ్యారు. ఈ క్రమంలో విద్యార్థిని కళాశాలలో ప్రిన్సిపల్ కొండయ్య, తదితరులు శుక్రవారం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని కాంక్షించారు.

బీవీనగర్‌లో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు.. బీవీనగర్‌లోని కృష్ణమందిర సమీపంలో సుధాకరయ్య కుటుంబం నివాసం ఉంటోంది. తిరుపతిలో ఉంటున్న ఆయన మామ ఈ నెల 14న మరణించారు. పెద్ద కర్మ నిమిత్తం సుధాకరయ్య తన కుటుంబంతో కలిసి తిరుపతికి బుధవారం వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి గ్రిల్స్‌కున్న తాళాన్ని పగలగొట్టి బీరువాలోని 40 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు వెండి దీపపు కుందెలు, కాళ్ల పట్టీలను అపహరించుకెళ్లారు. ఇంటికి గురువారం రాత్రి చేరుకున్న బాధితుడు చోరీ విషయాన్ని నిర్ధారించుకున్నారు. అనంతరం వేదాయపాళెం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ నరసింహారావు తెలిపారు.

ఆరోగ్యశ్రీ వార్డుల్లో ఆకస్మిక తనిఖీలు



వివరాలను ఆరాతీస్తున్న అశోక్‌బాబు

నెల్లూరు(అర్బన్): ఆరోగ్యశ్రీ ద్వారా అందుతున్న సేవలపై వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రాష్ట్ర స్పెషలాఫీసర్ డాక్టర్ అశోక్‌బాబు జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీలను శుక్రవారం చేపట్టారు. ఆరోగ్యశ్రీ ఉన్న కొన్ని ఆస్పత్రులపై ఆరోపణలొస్తున్న నేపథ్యంలో తనిఖీలను నిర్వహించారు. పొగతోటలోని రిచ్ ఆస్పత్రిలో గల ఆరోగ్యశ్రీ వార్డుల్లో ఉన్న రోగులకు అందుతున్న వైద్యసేవలను ఆరాతీశారు. అనంతరం దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో ఆరోగ్యశ్రీ వార్డులో ఉన్న రోగులతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ వార్డులకు సంబంధించిన వైద్యులకు సూచనలు చేశారు.

సాయి సూక్తి పుస్తకావిష్కరణ



నెల్లూరు రూరల్: జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు రమణమూర్తి రచించిన సాయి సూక్తి పుస్తకాన్ని పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. వాకర్స్ డిప్యూటీ గవర్నర్ సుధాకర్‌రెడ్డి, విశ్రాంత జైలు సూపరింటెండెంట్ అనంతరావు, రాజగోపాల్, కృష్ణయ్య, బాలసుబ్రహ్మణ్యం, ప్రసాద్, ఖాసిం, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా వార్డు సచివాలయ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. 41వ డివిజన్లోని మూలాపేటలో గల సచివాలయాన్ని శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఆస్తి పన్నులు, యూజర్ చార్జీలను వేగవంతంగా వసూలు చేయాలని చెప్పారు. సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను అందించాలని సూచించారు. జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా రీ సర్వేను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.

కుట్టు మెషీన్ల పంపిణీ



నెల్లూరు(వేదాయపాళెం): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పేద మహిళలకు కుట్టు మెషీన్లను ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ నిర్వాహకురాలు పర్వీన్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. టౌన్‌హాల్లోని రీడింగ్ రూమ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ నేతల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దివ్యాంగుడికి వీల్ చైర్‌ను అందజేశారు. సంస్థ సభ్యులు రిషిత, వసుంధర, తదితరులు పాల్గొన్నారు.